

మండల పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న కొండూరి రవీందర్‌రావు

# తెలంగాణను సాధించిన కేసీఆర్‌కే పట్టం

- ఊహకు అందని విధంగా ఉత్సాహవంతులైన ఓటర్లు
- కేటీఆర్‌కు భారీ మెజార్టీ అందించేందుకు కృషి చేసినందరికి కృతజ్ఞతలు
- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

గంభీరావుపేట, డిసెంబర్ 1: తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌కే ప్రజలు పట్టం కడుతారని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు స్పష్టం చేశారు. కేటీఆర్‌కు భారీ మెజార్టీ అందించేందుకు కృషి చేసిన కార్యకర్తల సేవలు అభినందనీయమన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసుకున్న మండల స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా కొండూరి రవీందర్‌రావు హాజరై మాట్లాడారు. నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కేటీఆర్‌కు భారీ మెజార్టీ అందించడమే లక్ష్యంగా సుమారు 40 రోజుల పాటు కృషి చేసిన పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరికీ కేటీఆర్ అండగా ఉంటారన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌కు అండగా నిలువనున్నారని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా ప్రాంతం అంటేనే ఫ్లోరోసిస్ బారిన పడిన దివ్యాంగులు అనే విషయాలు నాడు ఉండేవని, కేసీఆర్ చేపట్టిన మిషన్ భగీరథతో అక్కడ ప్రస్తుతం ఫ్లోరోసిస్ అనే విషయం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రం సాధించిన మొదటి ఐదేళ్లలోనే కరెంటు సమస్యను తీర్చుకుని, వచ్చే 15 ఏళ్ల వరకు కూడా కరెంటు సమస్యల లేకుండా ఉండేందుకు సరిపడా ఉత్పత్తులను పెంచుకున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో మన మెట్ట ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి సాగు విస్తీర్ణం మెరుగు పడిందన్నారు. నియోజకవర్గ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా జిల్లా కేంద్రంలోని విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, మెడికల్, వ్యవసాయ కళాశాలను కేటీఆర్ ప్రత్యేక సహకారంతో సాధించుకున్నామన్నారు. మాంసం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం రెండో స్థానంలో, వరి ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలుపుకున్నామని తెలిపారు. ప్రగతిని చూసి తిరిగి కేసీఆర్ పాలనే కావాలని ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధపడ్డారని కొండూరి పేర్కొన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధికి ఆకర్షితులైన ప్రజలు ఎగ్జిట్ పోల్స్, సర్వేల ఊహలకు అందకుండా చైతన్యవంతులయ్యారన్నారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అపోహలను ఎవరూ నమ్మవద్దని, అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్ పాలనకు జై కొట్టారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి గౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ కొత్తింటి హన్మంతరెడ్డి, ఆర్బీఎస్ కన్వీనర్ రాజేందర్, నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్‌రెడ్డి, పెద్దవేని వెంకటియాదవ్, గంద్యాడపు రాజు, లింగన్నగారి దయాకర్‌రావు, గోగు లింగంయాదవ్, లక్కిరెడ్డి లతారెడ్డి, కమలాకర్‌రెడ్డి, కామిడి సదాశివరెడ్డి, అక్కపల్లి రాజనర్సింహారెడ్డి, వహీద్, రత్నాకర్, బాలలక్ష్మి, సుతారి బాలవ్వ, నిరంజని, దోమకొండ ఎల్లం, బిల్లా రాజు, సిరిపురం అంజయ్య, నాగారపు దేవేందర్ తదితరులు ఉన్నారు.


ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు

# స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన కలెక్టర్

- ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో పటిష్ఠ భద్రత

కరీంనగర్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల ముగిసిన తర్వాత ఈవీఎం బాక్స్‌లు భద్రపర్చిన ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలోని ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను కరీంనగర్ కలెక్టర్ పమేల సత్పతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు కూడా ఆమె వెంట వచ్చి స్ట్రాంగ్ రూంలకు వేసిన తాళాలను పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన భద్రతను కూడా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని భద్రత సిబ్బందికి కలెక్టర్ సూచించారు. కాగా కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను గురువారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఎస్‌ఆర్‌ఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించారు. మూడంచెల పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు. రేపు (ఈనెల 3న)ఓట్ల లెక్కింపు వరకు ఈ భద్రత కొనసాగుతుంది. కలెక్టర్ వెంట కరీంనగర్ ఆర్డీవో కే మహేశ్ తదితరులు ఉన్నారు.


ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల వద్ద కాపలా కాస్తున్న భద్రతా బలగాలు


కొలనూర్‌లో సాగు చేసిన బంతి పూల తోటలో చిన్నారి

# సిరుల బంతి

- పండుగ పూట కాసులు కురిపిస్తున్న పూదోటలు
- లాభాలు గడిస్తున్న యువ రైతులు

ఓదెల, డిసెంబర్ 1: వారంతా యువరైతులు..సాధారణ రైతుల్లా కాకుండా మూస సాగుకు స్వస్తి చెప్పి సిరులు కురిపించే బంతి పూల సాగుపై దృష్టి పెట్టారు. పండుగలకు దిగుబడి చేతికందేలా ప్రయోగాత్మకంగా పూదోటలను వేస్తున్నారు. ఇదే కోవలో కొలనూర్‌కు చెందిన యువ రైతు కొల్లూరి రాయమల్లు సర్కారు అందిస్తున్న ప్రోత్సాహంతో ముందుకెళ్తూ విరివిగా లాభాలు గడిస్తున్నాడు. సంప్రదాయ పంటలతో ఆశించిన మేర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్నారు. ఓదెల మండలం కొలనూర్ గ్రామానికి చెందిన కొల్లూరి రాయమల్లు ట్రాన్స్‌కో ఉద్యోగి. ఆయనకు నాలుగెకరాల పంట భూమి ఉన్నది. ఆయనకు చిన్నప్పటి నుంచే వ్యవసాయం అంటే మక్కువ ఎక్కువ. అటూ ఉద్యోగం చేస్తూనే సేద్యంలోనూ రాణిస్తున్నాడు. మూడున్నర ఎకరాల్లో వరితో పాటు తీరొక్క పంటలు వేశాడు. 20 గుంటల్లో ఆగస్టులో బంతి పూలు తోటను సాగు చేశాడు. ఇందుకు రూ. 32 వేలు పెట్టుబడి పెట్టాడు. ప్రస్తుతం సంక్రాంతి పండుగ, అయ్యప్ప దీక్షల సమయంలో చేతికి అందనుండగా రూ. లక్ష మేర సంపాదిస్తానని చెబుతున్నాడు. చుట్టు పక్కల గ్రామాల్లోని పలువురు యువకులు ఫొటో షూట్ కోసం తన తోటల్లోకి రావడం ఆనందంగా ఉందని పేర్కొంటున్నాడు.


కొలనూర్‌లోని బంతి తోట

### గిరాకీ ఉంటుందనే బంతి పూలు సాగు

రైతులందరం ఒకే రకమైన వరి పంట సాగు చేస్తే మార్కెట్లో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో వానకాలంలోనే పంటల మార్పిడి చేసిన. మార్కెట్లో మంచి గిరాకీ ఉండే బంతి పూల తోటను ఎంచుకుని సాగు చేసిన, మంచి ఫలితాలు ఉన్నాయి. పంటల మార్పిడి వలన భూమికి కూడా మంచిదే. అందుకే నేను వరి, పూలు, కూరగాయలు, మిర్చి వంటి వివిధ రకాల పంటలను వేసిన. సక్సెస్ అవుతున్న. సంతోషంగా ఉంది. ప్రభుత్వం సైతం సబ్సిడీపై డ్రిప్ ఇచ్చి ప్రోత్సహిస్తున్నది.

**- కొల్లూరి రాయమల్లు, రైతు దంపతులు, కొలనూర్ (ఓదెల)**



# ఆ 'పాత' మధురం

- గత స్మృతులు నేటికి పదిలం
- సవారీ కచ్చురం, సంధ్యాదీపం, గాజా తదితర సామగ్రిని దాచుకున్న పలువురు

ఓదెల, డిసెంబర్ 1: అధునాతన జీవనవిధానంలోనూ కొందరూ పాత గురుతులను పదిలంగా దాచి భవిష్యత్ తరాలకు మరుపురాని జ్ఞాపకాలను అందిస్తున్నారు. తమ పూర్వికులు వాడిన వస్తువులను ఇంట్లోనే పదిలంగా ఉంచుకుంటున్నారు. ఇదేకోవలో ఓదెల మండలం అబ్బిడిపల్లికి చెందిన గెల్లు వీరమల్లు అనే రైతు, కనగర్తిలో ఎంపీటీసీ ఆరెల్లి సరోజన ఇండ్లల్లో నేటికి సవారీ కచ్చురాన్ని భద్రంగా కాపాడుతున్నారు. ఇంటికి వచ్చిన వారు ఈ బండిని ఆశ్చర్యంగా చూస్తున్నారు. కొలనూర్‌కు చెందిన గీట్ల రాఘవరెడ్డి అనే రైతు పురాతన సవారీ కచ్చురంను మరమ్మత్తు చేయించి రోజు దీనిపైనే వ్యవసాయ పనుల వెళ్తున్నారు. దీనిని చూసిన వృద్దులు తమ చిన్ననాటి గత స్మృతులను నెమరు వేసుకుంటుండగా, ప్రస్తుత పిల్లలకు మా చిన్న వయస్సులో ఇవే కార్లని చూపించడం కన్పిస్తుంది. అలాగే అబ్బిడిపల్లిలో వెనకటి రోజుల్లో నీటిని నిల్వ చేసుకోవడానికి కుమ్మరులు మట్టితో తయారు చేసిన 'గాజా'లను వినియోగిస్తుండేవారు. దానిని పగలకుండా జింకిరి సదయ్య తన ఇంట్లో నేటికి నీటిని అందులోనే నిల్వ చేసుకుంటుండడం కనిపించింది. కనగర్తి గ్రామంలో మాజీ సర్పంచ్ ఆరెల్లి మొండయ్యగౌడ్ ఇంట్లో 'సంధ్యాదీపం' నేటికి రోజు వెలిగిస్తున్నారు. ఇలా కొందరు తమ వారు వారసత్వంగా ఇచ్చిన వస్తువులను పదిల పరుచుకుంటున్నారు.


కనగర్తిలో ఇంటిలో 'సంధ్యా దీపం'


గతంలో నీటి కోసం వాడిన 'గాజా'


అబ్బిడిపల్లిలో ఇంట్లో రేకుల షెడ్‌లో దాచిపెట్టుకున్న 'సవారీ కచ్చురం'